# ముగింపు

## బద్దిగం పాండురంగారెడ్డి

"మూర్తీ!"

వెనుతిరిగి చూశాను, ఎదురుగా శివరాం నిలబడి ఉన్నాడు.

"ఎప్పుడొచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఒక గంటయ్యింది" నవ్వుతూ జవాబిచ్చాడు.

"వచ్చేముందు లెటర్ వ్రాయలేదేం? వచ్చి రిసీవ్ చేసుకునే వాణ్ణి కదా!"

"అనుకోకుండా వచ్చాను. లేకుంటే రాసేవాణ్ణే. పద అలా హోటల్లోకి వెళ్ళి కాఫీ త్రాగుదాం."

శివరాం వెంట నడిచాను. ఇద్దరం జన సమర్ధంలో నుండి తప్పించుకుని ఎదురుగా కనబడిన ఉడిపి హోటల్లోకి నడిచాము.

ఓ మూల ఉన్న టేబుల్ ముందు కూర్చున్నాం ఇద్దరం. కిటికీ గుండా మెయిన్ రోడ్ కనబడుతున్నది.

శివరాం నేను చూసినప్పటికంటె బాగా లావైనాడు. మనిషి బాగా సంపాదిస్తున్నాడల్లే ఉంది. లేకుంటే అతని ఆకారంలో అంత మార్పు వచ్చి ఉండేది కాదు. అతనూ, నేనూ చాలాకాలం నుండి స్నేహితులం. డిగ్రీ అవగానే శివరాం కొద్ది పెట్టుబడితో బిజినెస్‌లోకి దిగాడు. అతనిలో ఒక గొప్ప గుణం ఉంది. అది మంచి గుణం అనండి, లేదా చెడ్డదనే అనండి. శివరాం గొప్ప మాటకారి. ఎదుటివాళ్ళను తన మాటలతో ఇట్టే లొంగదీసుకుంటాడు. ఎంతటి నమ్మదగని విషయమైనాసరే ఎదుటివాళ్ళను ఇట్టే నమ్మించేయగలడు. తనకున్న ఆ ప్రతిభ వల్లనే ఎంతో సునాయాసంగా బిజినెస్‌లోనికి చొచ్చుకుని వెళ్ళాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్" శివరాం మాటలకు ఉలిక్కిపడ్డాను.

"అబ్బే ఏమీలేదు" అని సమాధానమిచ్చి "ఎన్నాళ్ళుంటావ్" అని అడిగాను.

సర్వర్ రావటంతో కాఫీకి ఆర్డరిచ్చి చిన్నగా నవ్వాడు, "ఎన్నాళ్ళోనా" అంటూ.

"అంటే..."

"ఇంకో గంటలో వెళ్ళాలి."

"ఏం అంత అర్జంటా? చాలారోజులకు కలిశావు. రెండు రోజులు ఉండి వెళ్ళగూడదూ. సరదాగా కాలక్షేపం చెయ్యవచ్చు" అన్నాను.

"లేదు ఈ రోజే వెళ్ళాలి. విజయవాడకు ఓ మంత్రిగారు ఏదో శంకు స్థాపనకని వస్తున్నారట. ఆయన్ను కలవాలి. ఆయనవల్ల జరగవలసిన పనులు కొన్ని ఉన్నాయి. అందుకని ఆయనతో మాట్లాడాలి. లేకపోతే తప్పకుండా ఉండేవాణ్ణి. నీ శ్రీమతిని కూడా చూసినట్లు ఉండేది" సిగరెట్ తనొకటి వెలిగించుకుని నాకొకటి ఆఫర్ చేశాడు.

శివరాం నా పెళ్ళికి రాలేదు. ఆ టైమ్‌లో శివరాంకి బోల్డు ఇబ్బందులు ఎదురైనాయి. కొత్తగా అప్పుడే బిజినెస్ పెట్టడంవలన పనుల వత్తిడి వలన పెళ్ళికి రాలేకపోతున్నానని ఉత్తరం వ్రాశాడు.

"నీ ఉద్యోగం ఎలా ఉంది?"

"నా ఉద్యోగానికేం లక్షణమైంది" నవ్వుతూ అన్నాను.

"ఎన్నాళ్ళయింది నీవు ఉద్యోగంలో చేరి?" హఠాత్తుగా అడిగాడు.

"నాలుగేళ్ళు."

"ముందుకు జరిగావా, లేక అక్కడే ఉన్నావా?" సిగరెట్ పొగని రింగులుగా వదులుతూ అన్నాడు.

"అంటే?" అర్థంకాలేదు నాకు.

"అదే ప్రమోషన్ ఏమీ లేదా?" అంటూ నవ్వాడు.

"లేదు."

"ఓ హెల్ప్ చెయ్యగలవా?"

"ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"నా కజిన్ ఒకడున్నాడు. వాడు డిగ్రీ పాసయ్యాడు. ఉద్యోగం కోసం సతమతమైపోతున్నాడు. మీ ఆఫీసర్‌తో చెప్పి ఏమన్నా చూడగలవేమోనని.. మీ ఆఫీసర్ మేసేవాడైతే మరీ మంచిది. తృణమో పణమో పారేద్దాం" నా సమాధానం కోసం ఉత్సాహంగా ముందుకు జరిగాడు బల్లమీద చేతులు ఆన్చి.

శివరాం మాటలకు పెద్దగా నవ్వాను. "మా ఆఫీసర్ అలాంటివాడు కాదు. చండశాసనుడు" అంటూ. శివరాం ఆలోచనకు నవ్వుకున్నాను. ఇలాంటి శివరాంలను మా ఆఫీసరు ఎంతోమందిని చూశాడు. పాత ఆఫీసర్ టైమ్‌లో అర్హత లేనటువంటివాళ్ళు చాలామంది రికమండేషన్లతో, లంచాలతో వచ్చారు. ఈయన అలాంటివాడు కాదు.

"మూర్తీ! ఆమెను చూడు" హఠాత్తుగా అన్నాడు శివరాం రోడ్డుమీద పళ్లను కొంటున్న ఓ స్త్రీని చూపుతూ.

ఒక్కక్షణం ఆమెవంక చూశాను. హోటల్ కిటికీలో నుండి ఆమె స్పష్టంగా కనబడుతున్నది.

"ఎవరామె?" అడిగాను నేను.

"మా మామయ్య కూతురు. అదే.. నీకొకసారి చెప్పాను. గుర్తులేదూ? నన్ను ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేసిందని. ఆమే ఈమె" గట్టిగా ఓమారు పొగపీల్చి అన్నాడు శివరాం.

"అవును. ఓసారి చెప్పావు గుర్తుంది. అసలు ఆమె నిన్ను ఎందుకు మోసం చేసింది" ఆశ్చర్యంగా అడిగాను.

రిక్షాలో వెళుతున్న ఆమెవంక ఓమారు చూసి "హు! చూస్తాను. ఆమె జీవితం నాశనం చెయ్యకపోతే నాపేరు శివరామే కాదు."

ఉలిక్కిపడ్డాను శివరాం మాటలకు. ముందు ఉన్న మూడు గ్లాసుల్లోని నీళ్ళను త్రాగి "అసలు విషయం చెప్పు" అన్నాను ముందుకు జరుగుతూ.

ఓమారు టైమ్ చూసుకున్నాడు శివరాం.

నేను చూపించిన ఉత్సాహానికి ఓమారు నవ్వి అన్నాడు, "నీవు ఎందుకు అడుగుతున్నావో నాకు తెలుసు. కథకు పాయింట్ లాగుదామని కదూ?"

నేను కథలు రాస్తుంటానని శివరాంకి తెలుసు. అందుకనే అలా అడిగాడు.

నవ్వి ఊరుకున్నాను.


"ఆమె నాకు స్వయానా మేనమామ కూతురు." చెప్పడం మొదలుపెట్టాడు శివరాం- బలంగా ఓమారు సిగరెట్ పొగపీల్చి వదులుతూ.

ఇంట్రెస్టుగా వినసాగాను.

"చిన్నప్పటి నుండి ఇద్దరం కలసి మెలసి తిరిగాం. ఆమంటే నాకు ప్రాణం. అలాగే నేనంటే ఆమెకు. కాలేజీలో చేరిన తరువాత మెల్లగా ఆమెలో మార్పు రావడం మొదలుపెట్టింది. అప్పటికి మేము పెద్దగా ఆస్థిపరులం కాదు. మావయ్యకు మాత్రం బోలెడు ఆస్థి ఉంది. కాలేజీలో చేరిన దగ్గరనుండి

ఆమెకు చాలామంది బాయ్‌ఫ్రెండ్స్ తోడయ్యారు. అందరితో సోషల్‌గా మూవ్ అవుతుండేది. నేను అంతగా పట్టించుకునే వాణ్ణి కాదు. ఆమె మనసు నాదే అనుకున్నాను. మెల్లగా ఆమెలో మార్పు రాసాగింది. నేనంటే ఆమెలో నిర్లక్ష్యం చోటుచేసుకుంది. ఎవడి స్కూటర్ వెనుకనో, ఇంకే వెధవ కారులోనో తిరుగుతుండేది. ఆమె ప్రవర్తన నాకు నచ్చలేదు. ఇక ఒకరోజు సహించలేక ఆమె ప్రవర్తన గురించి మావయ్యతో చెప్పాను.

అందుకు ఆయన పెద్దగా పట్టించుకోకుండా



''చిన్న పిల్లలెద్దూ. మెల్లగా తెలుసుకుంటుంది. నేను చెప్పి కోప్పడతాలే'' అంటూ నన్ను అనునయించాడు. ఒకరోజు ఆమెతో అన్నాను 'ఇలాగైతే మనిద్దరికీ ముడిపడదు' అని. అందుకు ఆమె ఏమన్నదో తెలుసా?'' ఓమారు బలంగా దమ్ము పీల్చి వదులుతూ అన్నాడు.

''ఏమన్నది?'' ఆశ్చర్యంగా అడిగాను.

''నీకూ నాకూ ఎవడు ముడివేస్తున్నాడు'' అన్నది.

ఆరోజు నుండి ఇక ఆమె ముఖం చూడలేదు. పెళ్ళికి రమ్మని మావయ్య ఉత్తరం వ్రాసినా నేను వెళ్ళలేదు. మళ్ళీ ఈరోజే ఆమెను ఇక్కడ చూశాను. ఇక వదలను.''

''ఏం చేస్తావ్?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఆమె నాకు చాలాకాలం క్రితం రెండు ప్రేమలేఖలు వ్రాసింది. అవి మేం ఇద్దరం సఖ్యతగా ఉన్న రోజుల్లోనాటివి. ఆమె అడ్రస్ తెలుసుకుని ఆమె మొగుడికి పంపుతాను. ఆ దెబ్బతో కాని నా హృదయం తేలిక పడదు.''

ఒక్కక్షణం నేనేమీ మాట్లాడలేదు.

''ఈ రెండు ఉత్తరాలు పంపటంతో నాకథకు 'ముగింపు' పూర్తయింది.'' చివరంటా కాలిన సిగరెట్‌ను బూటు క్రింద నలుపుతూ అన్నాడు శివరాం.

''ముగింపు బాగోలేదు'' అన్నాను నేను.

''కొన్ని ముగింపులు ఇలాగే ఉండాలి. పద. నాకు టైమవుతున్నది.''

లేచాడు శివరాం.

శివరాం బిల్లు చెల్లించాడు. ఇద్దరం స్టేషన్ రోడ్డు పట్టాం.

''ఏమిటి ఆలోచిస్తున్నావ్?'' అడిగాడు శివరాం.

''నీవు చెప్పిన కథకు ముగింపు ఆలోచిస్తున్నాను'' అన్నాను.

''మీ రచయితలకు ఏదీ చెప్పకూడదు. ఏదన్నా దొరికిందంటే ఒక పట్టాన వదిలేరు'' నవ్వాడు శివరాం.

ఇద్దరం స్టేషన్ చేరుకున్నాము. నాకు ప్లాట్‌ఫారం టిక్కెట్టు తీసుకున్నాడు శివరాం. మేము లోనికి వెళ్ళేటప్పటికి ప్లాట్‌ఫారం మీద బండి రెడీగా ఉన్నది. శివరాం ఖాళీగా

ఉన్న ఒక

పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు.

''మళ్ళీ ఎప్పుడొస్తావ్?'' అడిగాను.

''చెప్పలేను. చాలా బిజీగా ఉన్నాను'' అన్నాడు నవ్వుతూ.

శివరాం ప్రక్కన కూర్చున్నవాడిని కాస్త లేచాను.

''నా కథకు ముగింపు దొరికింది'' అన్నాను నవ్వుతూ.

''అయితే ఇందాకటి నుంచి నీకు కావలసిన ముగింపు కోసం ఆలోచిస్తూనే ఉన్నావన్నమాట'' ఆశ్చర్యంగా అన్నాడు.

''ముగింపు ఎప్పుడో దొరికింది'' నవ్వాను నేను.

''మరి చెప్పవేం?'' ఉత్సాహంగా అడిగాడు శివరాం.

''నా కథలో హీరోయిన్ పేరు లలిని.''

ఉలిక్కిపడ్డాడు శివరాం లలిని అన్నపేరు నా నోటివెంట విని. నేను గమనించినా కంటిన్యూ చేశాను.

''హీరో లేదా విలన్ పేరు శివరాం'' శివరాం నావంక ఆశ్చర్యంగా చూస్తూ వినటం గమనించాను.

''లలిని శివరాంని ప్రేమిస్తుంది. శివరాం చాలా తెలివైనవాడు. లలినీ ఆస్తిని మాత్రం అతను ప్రేమించాడు. లలిని ఆమె తండ్రికి ఒక్కతే కూతురు కావటంతో ఆస్తి అంతా తనకే దక్కుతుందనుకున్నాడు పెళ్ళిచేసుకుంటే. ఆమె తండ్రి లలినీని శివరాంకిచ్చి పెళ్ళి చెయ్యటానికైతే ఒప్పుకున్నాడు. కాని ఆస్తిని మాత్రం అప్పుడే ఇవ్వటానికి ఒప్పుకోలేదు. చేతనయితే స్వంతంగా సంపాదించుకుని బ్రతకమని సలహా ఇచ్చాడు. అది నచ్చలేదు శివరాంకి. లలిని ప్రాధేయపడినా వినిపించుకోక ''నీకు ఆస్తిలేనప్పుడు ఇక నీవు నాకెందుకు?'' అని కాలదన్నాడు'' నేను చెప్పటం ఆపి శివరాం వంక చూశాను.

శివరాం ముఖం వెలాతెలా బోతున్నది.

''ఎలా ఉన్నది ఈ ముగింపు?'' కొద్ది క్షణాల తర్వాత ఎటో చూస్తూ అన్నాను.

అతని నుండి సమాధానం ఆశించడానికి వీలులేకపోయింది బండి కదలడంతో.

''శివరాం! ఆమె గురించి నాకు బాగా తెలుసు. ఆమె చాలా ఉత్తమురాలు. ఆమె మీద అన్యాయంగా ఓ కథ అల్లి చెప్పావు. నీగురించి కూడా నాకు తెలుసు.''

''ఆమె నీకెలా తెలుసు?'' శివరాం గొంతు కొద్దిగా వణుకుతున్నట్టుగా ఉంది.

''ఆమె నా భార్య'' అంటూ కదులుతున్న రైల్లోంచి కిందకు దూకాను.

★